11.04.2022 నాడు గుండుగొలను గ్రామంలో
శ్రీరాములవారి ఊరేగింపులో పాల్గొన్న శ్రీ మాతాజీ





# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ

సంపుటి 41 సంచిక 10

పేజీలు 44

జూన్ 2022

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ........................... ....... **పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట.................................... ............ 7

అగస్త్య హృదయం ....................... .............9

మనసు - మాయ........................... .............11

భక్తి హృదయం ................ ..........................13

తండ్రి ఆశీర్వాదం ........................................15

శ్రీబాబు దివ్య రక్షణ........................................17

భక్త సూరదాసు ............. ..........................18

భక్తుడు.... ..............................................................21

బరువులు................................ ....................25

కైవల్యోపనిషత్ ... ...........................................27

సులభ మార్గం ..............................................29

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ....................31

శ్రీ మాతా కళావతీ దేవి.............................32

వివేక చూడామణి ................ .................34

గురువు ........................... ..............................36

నిరీక్షణ ..........................................................37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... ............................ ...................41

**23)** **కొంజకతర్క వాదమను గుద్దలిచే బరతత్త్వ భూస్థలిన్**
**రంజిల ద్రవ్వి కన్గొనని రామ నిధానము నేడు భక్తి సి**
**ద్ధాంజనమందు హస్తగత మయ్యె భళి యనగా మదీయహృ**
**త్కంజమునన్ వసింపుమిక దాశరథీ కరుణాపయోనిధీ!**



భావం - పరతత్త్వమనే భూమిని తర్కవాదమనే గునపముతో బాగుగా త్రవ్విన కనుగొనగరాని రాముడను నిధి, భక్తియను బైరాగుల కాటుకతో నందరు సెబాసనగా జేజిక్కినదయ్యెను. ఇంక నా మనస్సు నందు స్థావరముగా నిలువుము. దాశరథీ! కరుణాపయోనిధీ!

*నందిని పందిగా, పందిని నందిగా చేయగలిగినది ఏది?
*ఏది వృథా కంఠక్షోభ అని జగద్గురువులు చెబుతున్నారు?
*భక్తి శ్రద్ధలు కలిగిన వానికి ముల్లు ఎందుకు గుచ్చుకుంది?
*ఏ మహాభక్తుని నేత్రాలు కృష్ణజ్యోతితో ప్రకాశించాయి?
*మీరంతా ఎవరి బిడ్డలని శ్రీబాబూజీ చెప్పేవారు?
*గురువు దేనికి అందడు?
*పద్మ ప్రబోధం అంటే ఏమిటి?
*బ్రహ్మదేవుని కుమార్తెలు ఎవరు?
*వృద్ధిలోకి వచ్చినా బిచ్చగాడు ఎందుకు సాధారణ జీవితం గడిపాడు?
*కళ్ళు లేకుండా చూసేది, చెవులు లేకుండా వినేది ఏది?
*సూచన మంత్రం దేనిని గుర్తింపజేస్తుంది?
*ప్రయాణంలో స్తోత్రాలు చదవడం ఎందుకు?

***సమాధానాలు లోపలి పేజీలలో ...........................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

రామకృష్ణ పరమహంస శిష్యుడు ఒకరు అమెరికాలో వుండేవారు. కనీసం పరమహంసను చూడలేదు. వివేకానందుని బోధలద్వారా గురుదేవుని తెలుసుకుంటాడు. గురుదేవుని దర్శనాన్ని కూడా పొందారు. ఆయనే బేలూరు మఠానికి కొన్ని లక్షల ధనాన్ని ఇచ్చారు.



కప్ప కమలం దగ్గర ఉంటుంది ఏం లాభం? క్రింద బురదలో ఉండి పురుగులని తింటూ ఉంటుంది. ఆ కమలము యొక్క మకరందాన్ని పొందలేదు. కాని తుమ్మెద ఎప్పుడో ఝుమ్మని వస్తుంది. ఆ కమలం లోని మకరందాన్ని గ్రోలి ఆనందాన్ని పొందుతుంది. అలాగే భక్తుడు కూడా.

ఇంతలో విఠల్ ప్రశ్నించారు. 'ప్రారబ్ధ కర్మ అంటే ఏమిటి?' అని

'నువ్వు ఇక్కడకు ఎలా వచ్చావు?' అదే ప్రారబ్ధ కర్మ అంటే. కాని ఇక్కడకు వచ్చిన తరువాత మనసు నిలబడాలి కదా?

ఉదాహరణకి నిన్న, మొన్న, నీకు ఒక చర్చ వచ్చింది. కొన్ని సంఘటనలు జరిగాయి. దాన్ని ఎదుర్కొని నిలబడాలిగా నువ్వు? ఎంత ప్రారబ్ధ కర్మ ఉన్నా, దాన్ని నిలబెట్టుకోవటం నీ చేతిలో ఉంది.

నేను మీ దగ్గర ఏమీ ఆశించను. నేను కోరేది మీ మనస్సులో భక్తి భావన. అది ఎంత ఆరూఢమైతే నీలో అంత ఆనందం. తపన వుండాలి. గురుదేవుని సందేశాన్ని అందుకొని, దాన్ని ఆచరణలో పెట్టాలి. గురుబోధని అందుకోవటానికి సదా ఎదురుచూడాలి, ముత్యపు చిప్పలాగా. స్వాతి వానచినుకు ముత్యపుచిప్పలో పడితే ముత్యం అవుతుంది. సముద్రంలో పడితే ఉప్పునీరు అవుతుంది. క్షేత్రంలో పడితే, ఫలసాయానికి ఉపయోగపడుతుంది. కాబట్టి, ఆ స్వాతివర్షము ముత్యపు చిప్పలో పడాలి. పడగానే అది మూసుకుపోవాలి. లేకపోతే ఆ నీరు

కారిపోతుంది. మూసుకోకపోయినా, చినుకు పడినపుడు తెరుచుకొనక మూసుకొని ఉన్నా, ఏమవుతుంది? ఆ తప్పు ఎవరిది? మేఘానిదా? ముత్యపుచిప్పదా?

భక్తుడు, ముత్యపుచిప్పవంటివాడు. అంటే, భగవానుని తన హృదయంలో ప్రవేశింపచేసుకునేవాడే భక్తుడు అని అర్థము. అలాగే నాకందరూ సమానమే. అందరికీ సమానముగానే అందిస్తాను. అందుకున్నవాడు పైకి వస్తాడు. అందుకోలేనివాడు అనుభవిస్తాడు. దానికి నన్నంటారు. అది నా తప్పా?

నాకు ఏదీ రహస్యంలేదు. ధ్యానం గురించి, మంత్రోపదేశం అంతా బహిరంగంగానే చెప్తాను. అందరూ అలా చెప్పరు. అంతా రహస్యంగా ఉంచుతారు. ఇంట్లో మాత్రమే బ్రహ్మం, ఏకత్వం. ఇంటి బయట నానాత్వము.

మరి ముండనం, కాషాయము, మెడలో రుద్రాక్ష ఉంటాయి. మరి నాకో, క్రాఫ్ ఉంది. మెడలో ముత్యాలు, పగడాలహారం ఉంది. ఎవ్వరిని నమ్ముతారు? వేషభాషలను చూసి నమ్ముతారా? నమ్మరా?

సత్యగురువును గుర్తించటం కష్టం. సత్యగురువు ప్రచారమన్నా ప్రకటన అన్నా ఇష్టపడరు. మరి అతన్ని ఎలా గుర్తిస్తారు? ఒకరు ఇంగ్లీషులో భగవద్గీత మీద అనర్గళంగా ఉపన్యసిస్తారు. మరి లాభం? పాండిత్యం ఉన్నవాళ్ళు నాలుగు శ్లోకాలు చదివి మెప్పిస్తారు. వారికి ఏమన్నా అనుభవం ఉందా? సత్యగురువును ఆశ్రయించినవారే తరిస్తారు.

సద్గురువులు, మహాత్ములు సూర్యునివంటివారు, వారికి ప్రచారం అవసరంలేదు. మామూలు బల్బులకు అవి యెన్ని కాండిల్సు వెల్తురిస్తుందో అన్న విషయం ప్రచారం చేసికొనాలి.

కొంతమంది శిష్యులు బాబుగారూ అంతా మీ దయేనండి. చిత్తం చిత్తం అంటూనే లోపల స్వంత ఆలోచనలు మానరు. ఇది లౌక్యం. లౌక్యపు జిత్తులకు గురువు అందడు.

- సశేషం

# అమ్మ మాట

(గత సంచిక తరువాయి) - జపమాలా ప్రసాద

***ఆటాడి ఆడకుండు***

బొమ్మలు కదులుతూ వుంటాయి, కానీ వాటిని ఆడించేవాడు బయటకు కనిపించడు, కదలడు. అందుకనే 'వాడు ఆటాడి ఆడకుండును' అని చెబుతోంది తత్వం. ఆ తోలు బొమ్మలు జడమైనవి. కనుక అవి 'మేము గనుక కదులుతున్నాం' అని చెప్పకోవు. కానీ, చైతన్యం తన లోపలే వుంచుకొని, చైతన్యవంతుడని పిలవబడుతున్న మానవుడు మాత్రం, అదంతా తన ప్రజ్ఞే అని విర్రవీగుతున్నాడు.



మనస్సు సంకల్పించడం వలన కర్మ చేస్తున్నాం. కర్మ వలన జన్మ వచ్చింది. కనుక, ధర్మంతో కూడిన కర్మ చేయాలి. మహాత్ములు తమలో వున్న శక్తిని గుర్తించినవారు కాబట్టి, వారి శక్తి ఇంద్రియాతీతమైన శక్తి. అదే '**అహమ్**' శబ్ద వాచ్యం.

దానినే మహాత్ములు మనకు ఒక సూచన మంత్రంగా **హంస శివ స్సోహమ్** అని అందించారు. దానినే మనం ప్రతి ఉదయం మన ప్రార్థనలో **అకారం, ఉకారం, మకారం తృతీయమ్ చిదానంద రూప శ్శివోహమ్** అని చిదానందాష్టకంలో పాడుకుంటున్నాము.

**అహం .... శివోహమ్** అని నోటితో మాత్రం చెప్పకునేది కాదు. దాని అనుభూతి శబ్దమాత్రం చేత అందేది కాదు. అదే రహస్యం. అది ఏదో మరచిపోయానని అనుకునేది కాదు. 'అది తాను' అని మన లోపలనే వుండి ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా గుర్తింపజేస్తోంది. అది కేవలం అనుభవైక వేద్యం.

వెలుగుని, చీకటిని కూడా నువ్వే గుర్తిస్తున్నావు. సుఖదుఃఖాలని, శీతోష్ణాలని, మానావమానాలను గుర్తిస్తున్నది కూడా నువ్వే. 'నువ్వే' అని అన్నప్పుడు మనసు, ఇంద్రియాలు కావు అవి జడమైనవి. కానీ, 'నేను వున్నాను' అనే నీ ఉనికికి కారణం నీలో వున్న చైతన్యమే. ఆ

'నేను' యొక్క ఉనికిని నీకు గుర్తింపజేస్తున్నది ఈ సూచన మంత్రం. దీనినే 'అజప గాయత్రి' అని కూడా అంటారు. నీవు జపం చేయకుండానే, నీకు తెలియకుండానే నీలో ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా నీవు మంగళ స్వరూపమైన శివస్వరూపమని నీకు గుర్తింపుకు తెస్తోంది ఈ సూచన మంత్రం.

ఇది పుస్తకాలలో చూసినంత మాత్రాన విషయం అర్థం కాదు. అది కేవలం స్వయంగా అనుభవం కలిగిన మహాత్ముల వద్దనే వారియొక్క పరిపూర్ణ అనుగ్రహం వలననే సిద్ధిస్తుంది. సత్యగురుదేవులను ఆశ్రయించి, వారి దివ్య బోధామృతాన్ని శ్రవణ మననాదులు చేసి నిదిధ్యాసకు తెచ్చుకున్ననాడు మన నిజ ఆత్మ మనకు అనుభూతమవుతుంది. అటువంటి మన నిజతత్వాన్ని గుర్తించడానికి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను అఖండ సాధన సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!



# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమో నమః।**

**నమః పద్మ ప్రబోధాయ మార్తాండాయ నమో నమః॥**

తాత్పర్యము - ఉగ్రరూపంలో గ్రీష్మతాపము కలిగించువాడవు, వీరత్వంతో వేగంగా సంచరించగలిగిన ఓ భాస్కరుడా! నీకు నమస్కారము. పద్మములు వికసించడానికి కారణమగుచూ బ్రహ్మాండమునకు జీవం పోసే ఆదిత్యుడా! నీకు నమస్కారము.

ఈ శ్లోకం ద్వారా అగస్త్యులు సాధకులను ఉద్ధరించడానికి గురుదేవులు పొందే ఆర్తితోపాటు, సాధకునికి ఎల్లప్పుడూ వుండవలసిన సావధానతను కూడా తెలియజేస్తున్నారు.

**నమ ఉగ్రాయ** అంటూ క్రోధమును సూచిస్తూ, సాధకుడికి రజోగుణ సంబంధమైన దృఢ సంకల్పం వుండాలని తెలియజేస్తున్నారు. శ్రీబాబూజీ మహరాజ్‌వారు సాధకుడికి పట్టుదల ఎంతో ఆవశ్యకమని శలవిస్తూ, 'సాధకుడికి క్రోధము మీద కోపం రావాలనీ, తద్వారా అరిష్వడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు ఒక్కొక్క దానిపై విజయం సాధించాలని సూచించారు. అది పొందటానికి కావలసిన ధీరత్వమును అందరూ కలిగివుండాలని ఆశీర్వదిస్తూ 'మీరంతా యదుసింహుని బిడ్డలు' అని స్ఫూర్తినిచ్చేవారు. ఆ ధీరత్వాన్ని మనందరిలో కలిగిస్తూ మన పాలిట మేరు పర్వతం వలె అండగా నిలిచిన గురుదేవులను స్తుతించే **ఓం మేరుధీరాయ నమః** అన్న నామంలో వున్న భావము అదే కదా!

**నమః పద్మప్రబోధాయ** అన్న సంబోధనను లోతుగా పరిశీలిస్తే ఎంతో విచారణ చేయదగిన అంశము. దీని ద్వారా ముకుళించి వున్న పద్మముపై జ్ఞానకిరణాలను ప్రసారం చేసిన గురుపరమాత్మ యొక్క జ్ఞాన భాస్కరుని రూపమును అగస్త్యులు ఆవిష్కరిస్తున్నారు.

ఎన్నో లక్షల మైళ్ళ దూరంలో వుండి, ఎన్నో వేల డిగ్రీల ఉష్ణోగ్రతతో మండిపోతున్న సూర్యుడు ఎంతో మృదువైన పద్మమునకు ఏ ప్రబోధము చేసి వికసింపజేస్తున్నాడు? విచారణ చేస్తే దీనిలో తన శిష్యుని

ఆదుకోవాలన్న గురుదేవుల ఆర్తి, అవ్యాజమైన కరుణతోపాటుగా ఆ కిరణ స్పర్శకోసం తపిస్తున్న పద్మము యొక్క తపన, ఆవేదన కనిపిస్తాయి. అలాంటి ఆవేదన చెందిన శిష్యునకు గురుదేవుల ప్రబోధము ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తప్పకుండా అందుతుంది.

ఈ విషయంలో శ్రీబాబు అనేకమందికి ఆ అనుభవాన్ని అందిస్తూనే వున్నారు. పద్మ ప్రబోధము అంతర్వాహిని అయిన సరస్వతియై చాతకపక్షివలే నిరీక్షిస్తున్న సాధకునికి మాత్రమే అవగతం అవుతుంది. ఆ పద్మ ప్రబోధమును గురుదేవులు వారి బోధల ద్వారా, లేక సంభాషణల ద్వారా, లేక మౌన వ్యాఖ్య ద్వారా కూడా అందించగల సమర్థులు. కానీ, ప్రతి సందర్భంలో తరచి చూసుకుని పరిశీలించిన సాధకుడికి మాత్రమే గుహ్యమైన పద్మప్రబోధము స్ఫురణకు వస్తుంది. అలాంటి పద్మప్రబోధము ద్వారా మహావాక్యములను సైతం అందించగల మన సద్గురుదేవులను మనం ప్రీతిగా **ఓం మహావాక్య ప్రబోధకాయ నమః** అని అర్చిస్తాము. ఆ పద్మ ప్రబోధమైన మధువును గ్రోలడానికి సాధకుడు తుమ్మెద సారంగము అయి వుండాలని **సారంగాయ నమో నమః** అన్న ప్రస్తావనతో అగస్త్యులు సూచిస్తున్నారు. అంతేకాక, సప్త వర్ణములకు ఆధారమైనప్పటికీ ఏ రంగూ అంటని సూర్యకాంతి వలే మార్పు చెందే జగత్తుకి ఆధారమైన నిర్గుణమైన, నిర్వికారమైన పరమాత్మ తత్వమును ఈ శబ్దము ద్వారా గ్రహించాలి.

**మార్తాండాయ నమో నమః** అన్న సంబోధనతో అగస్త్యులు మృతాండమైన విశ్వమునకు జీవం పోసి, సర్వాధారుడైన పురుషోత్తము నిగా గురుదేవులను గుర్తింపజేస్తున్నారు. ఆనాడు విశ్వరూప సందర్శనంతో అర్జునునికి జ్ఞానబోధ చేసిన ఆ విరాట్‌పురుషుని తన గురుదేవులలో ప్రతిసాధకుడు దర్శించాలని దీని అంతరార్థం.

ఈ విధంగా ఈ శ్లోకం ద్వారా అగస్త్యులు మంత్ర మూలమైన గురుదేవుల వాక్యములలో దాగి వున్న పద్మ ప్రబోధమునూ, ఆ మకరందమును గ్రోలడానికై సాధకుడు షట్పదియై వుండాలన్న సారాంశమును తెలియజేస్తున్నారు.

- సశేషం

# మనసు - మాయ

(గత సంచిక తరువాయి)

- వేలమూరి రవికుమార్

ఇక్కడ కొన్ని మానసిక, ఆధ్యాత్మిక పరమైన ప్రశ్నలు ఉదయించాయి.

1. రాజుగారు శరీరం సింహాసనంపైన సజీవంగా కూర్చుని వుండగానే అతనికి బోయజీవితానుభవం ఎలా కలిగింది?

2. పన్నెండు సంవత్సరాల కర్మ నాలుగు ఘడియలలో ఎలా పూర్తి అయింది?

3. తను తన రాజ్యంలోనే వున్నాడు. ఆ బోయ గూడెం ఏనాడు చూడ లేదు. కానీ, ఆ బోయ గూడెం ఎలా స్ఫురణకు వచ్చింది?

రాజుగారు మరునాడు ఈ విషయాన్నే వశిష్ఠులవారితో చర్చించారు. దానికి ఆయన చెప్పిన సమాధానాలు ఇలా వున్నాయి.

1) మనస్సే సర్వ జగత్ సృష్టికి కారణం. ఆ మనస్సు మాయా సంపర్కం చెందటం వలన (ఇంద్రజాలికుడు) అంతటి మహారాజు బోయవాడైనట్లు అనుభూతిని చెందాడు.

2) మనో సృష్టిలో కాలానికి, ప్రాంతానికి హద్దులు వుండవు. వుదాహరణకు మనం నిదురించేటప్పుడు చాలా రోజుల సంఘటనలు ఒక్కరాత్రిలో కలలో చూస్తాము. కనుక ఇక్కడ సమయం గురించిన ప్రశ్న అనవసరం. ఒక్క ఘడియలో పూర్తి జీవితాన్ని కూడా మనసు చూపగలదు. మనసు మాయా సంపర్కంతో ఇలాంటి ఎన్నో చిత్ర విచిత్రమైన పనులు చేయగలదు.

3) ఇంద్రజాలికుడు తన మాయను లవణ మహారాజుపై ప్రయోగం చేశాడు. దాని పర్యవసానం రాజుగారి మనస్సు బోయవాని మనస్సుతో లయమై ఆ బోయవాడి బాధలన్నీ తాను అనుభవిస్తున్నాననే భావన కలిగి తీవ్రమైన మానసిక, శారీరిక సంఘర్షణలకు గురి అయింది.

ఇంతటితో రాజుగారి కథ అవలేదు. రాజుగారు తనకు అనుభవం కలిగిందంటే ఎక్కడో ఒక చోట ఆ బోయ గూడెం వుండి వుండాలని తలచి, తన భటులను అన్నివైపులకు పంపించాడు. చివరకు వింధ్యాపర్వత శ్రేణులలో అటువంటి బోయగూడెం వున్నదని తెలుసుకుని అక్కడకు వెళ్ళాడు. అక్కడ ఒక ముసలి అవ్వ, కొంతమంది బోయలు

వున్నారు. అవే గుడిసెలు, అవే దారులు, అవే అడవులు, మనుషులు కూడా తాను కలలో చూసినవారే. రాజుగారు ఆమెను తనకు కలిగిన అనుభవ వృత్తాంతం గురించి ప్రశ్నించారు. ఆమె చెప్పిన దానికి, తనకు కలిగినదానికి సరిపోల్చి అది ఖచ్చితంగా నిజమని తెలుసుకున్నాడు. వెంటనే మహారాజు ఆ బోయలందరికీ సహాయం చేసి వారిని ఆ కరువు నుండి బయటపడవేశాడు.

మరల మహారాజుగారు చింతలో పడిపోయారు. తన కల అబద్ధమైతే ఈ గూడెం ఎలా నిజమైంది? ఇదే ప్రశ్న వశిష్ఠులవారిని అడిగారు. అప్పుడు మహర్షి ఇదంతా మాయా ప్రభావమని, మాయ నందిని పందిగా, పందిని నందిగా చేయగలదని చెప్పి రాజును సమాధానపరచి శాంతింప జేశారు.



# భక్తి హృదయం

సేకరణ - కె. శ్రీదేవి

రాజస్థాన్‌లో రమేష్ చంద్ర అనే దయగల ఒక శ్రీకృష్ణుని భక్తుడు ఉండేవాడు. అతనికి ఒక మందుల దుకాణం ఉండేది. షాపులో ఒక మూలన శ్రీకృష్ణుడి చిన్న చిత్రం ఉంది. ప్రతిరోజూ దుకాణం తెరిచిన తర్వాత, తన చేతులు కడుక్కొని, ఆ దేవుని బొమ్మను శుభ్రం చేసి, దీపం, ధూపం మొదలైన వాటిని చాలా భక్తితో వెలిగించేవాడు.

అతనికి రాకేష్ అనే కొడుకు కూడా ఉన్నాడు, తన చదువు పూర్తి చేసి తండ్రితో పాటు దుకాణంలో కూర్చునేవాడు. తన తండ్రి రోజూ ఇదంతా చేయడం చూస్తూ ఉంటాడు. నవీన యుగంలో చదువుకున్న యువకుడు అవడంవల్ల తన తండ్రికి, దేవుడు అంటూ ఎవరూ లేరని, ఇదంతా మన మనస్సు యొక్క భ్రమ అని వివరించేవాడు. సూర్యుడు తన రథంలో విశ్వం చుట్టూ తిరుగుతున్నాడని శాస్త్రాలు చెబుతున్నాయి, భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుందని సైన్స్ రుజువు చేసిందని చెప్తూ.. ఇలా ప్రతి రోజూ సైన్స్ నుండి కొత్త ఉదాహరణలను ఇస్తూ, దేవుడు లేడని నిరూపించడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు. తండ్రి అతనిని ఆప్యాయంగా చూసి నవ్వేవాడు తప్ప ఈ అంశంపై వాదించడానికి లేదా చర్చించడానికి ఇష్టపడేవాడుకాదు.

కాలం గడిచేకొద్దీ తండ్రి వృద్ధుడయ్యాడు. ఇప్పుడు తన అంతం ఆసన్నమైందని బహుశా అతను తెలుసుకుని ఉంటాడు...అలా ఒకరోజు తన కొడుకుతో 'నాయనా! నువ్వు భగవంతుని నమ్మినా నమ్మకపోయినా, నువ్వు కష్టపడి పని చేస్తూ, దయతో, నిజాయితీగా ఉంటే చాలు. అయితే నేను చెప్పే ఈ ఒక్క మాట విని, పాటిస్తావా?' అన్నాడు. కొడుకు 'అలాగే నాన్నా, తప్పకుండా పాటిస్తాను' అని అన్నాడు.

తండ్రి ఇలా చెప్పాడు, 'నాయనా! నా మరణానంతరం, ప్రతిరోజు దుకాణంలో ఉన్న దేవుని బొమ్మను శుభ్రం చెయ్యి. రెండవది, నువ్వు ఎప్పుడైనా ఏదైనా సమస్యలో ఇరుక్కుంటే, చేతులు జోడించి, శ్రీకృష్ణునికి నీ సమస్యను చెప్పుకో. నేను చెప్పినట్లు ఈ ఒక్క పని చెయ్యి చాలు' అన్నాడు. కొడుకు ఒప్పుకున్నాడు.

కొన్ని రోజుల తర్వాత తండ్రి చనిపోయాడు, కాలం అలా గడిచిపోతూ ఉంది...ఒకరోజు జోరున వర్షం కురుస్తోంది. రాకేష్ రోజంతా షాపులో కూర్చునే ఉన్నాడు, కస్టమర్లు కూడా చాలా తక్కువగా ఉన్నారు. ఆపై కరెంటు కూడా ఇబ్బంది పెడుతోంది. అకస్మాత్తుగా వర్షంలో

తడుస్తూ ఓ కుర్రాడు పరుగు పరుగున వచ్చి, "అన్నా .. ఈ మందు కావాలి.. మా అమ్మకి చాలా జబ్బుగా ఉంది .. వెంటనే ఈ మందు నాలుగు చెంచాలు వేస్తేనే ... అమ్మ బతుకుతుందని డాక్టర్ చెప్పారు... నీ దగ్గర ఈ మందు ఉందా?" అని అడిగాడు. రాకేష్ మందుచీటి చూసి వెంటనే "ఆ ... నా దగ్గర ఉంది" అని వెంటనే తీసి ఇచ్చాడు. బాలుడు చాలా సంతోషించి, వెంటనే మందుసీసాతో వెళ్ళిపోయాడు. అయితే ఇది ఏమిటి!! అబ్బాయి వెళ్లిన కొద్దిసేపటికే రాకేష్ కౌంటర్ వైపు చూడగానే చెమటలు పట్టాయి... కొద్దిసేపటి క్రితం ఓ కస్టమర్ ఎలుకల మందు సీసా తిరిగి ఇచ్చేసి వెళ్ళాడు. లైట్లు వెలగకపోవడంతో లైట్లు వచ్చిన తర్వాత దానిని సరైన స్థలంలో పెడదామని భావించి రాకేష్ కౌంటర్ పై సీసాను అలాగే వదిలేశాడు. అయితే మందు కోసం వచ్చిన ఈ బాలుడు తన మందు సీసాకు బదులు ఎలుకల మందు సీసాను తీసుకెళ్ళాడు.. ఆ బాలుడు నిరక్షరాస్యుడు కూడా.

'ఓరి భగవంతుడా !' అని రాకేష్ నోటి నుండి అసంకల్పితంగా ఆ మాటలు వెలువడ్డాయి, 'ఏమిటి ఈ విపత్తు!!' అనుకుని, అప్పుడు తన తండ్రి మాటలు గుర్తుకొచ్చి, వెంటనే, ముకుళిత హస్తాలతో, బరువెక్కిన హృదయంతో శ్రీకృష్ణుని చిత్రపటం ముందు ప్రార్థించడం ప్రారంభించాడు. 'ఓ ప్రభూ! మీరు ఉన్నారని తండ్రి ఎప్పుడూ చెబుతుండేవారు. మీరు నిజంగా ఉన్నట్లయితే, దయచేసి ఈ రోజు ఈ అవాంఛనీయ సంఘటన జరగనివ్వకండి. తన కొడుకు చేతిలో నుండి తల్లిని విషం త్రాగనివ్వకండి ... ప్రభూ ఆ విషాన్ని త్రాగనివ్వకండి!'

'అన్నా!' అని అప్పుడే వెనుక నుంచి ఒక గొంతు వినిపించింది... 'అన్నా, నేను బురదలో జారిపోయాను, మందు సీసా కూడా పగిలిపోయింది! దయచేసి నాకు మరో సీసా ఇవ్వవా', అని అడిగాడు. ప్రేమపూరితమైన చిరునవ్వుతో ఉన్న భగవంతుని చిత్రాన్ని చూస్తూండగా రాకేష్ ముఖంపై కన్నీళ్లు కారడం మొదలయ్యాయి!

ఆ రోజు, ఈ సమస్త విశ్వాన్ని నడిపేవారు ఎవరో ఉన్నారని అతనిలో ఒక విశ్వాసం మేల్కొంది...కొందరు ఆయన్ని భగవంతుడంటే, మరికొందరు సర్వోన్నతుడు అంటారు, కొందరు సర్వవ్యాపి అని, మరికొందరు దైవిక శక్తి అని అంటారు! ప్రేమ, భక్తితో నిండిన హృదయంతో చేసిన ప్రార్థన ఎప్పుడూ ఆలకించబడుతుంది.

# తండ్రి ఆశీర్వాదం

అవసానదశలో ఉన్న ఒక తండ్రి తన ఏకైక కుమారుడైన ధరమ్ పాల్‌ని పిలిచి, “ప్రియమైన కుమారా! నీకు వారసత్వంగా వదిలి వెళ్ళడానికి నేను ఏ సంపదను కూడగట్టలేకపోయాను. కానీ జీవితాంతం నా పని యెడల ఎల్లప్పుడూ నిజాయితీగా, ప్రామాణికంగా ఉన్నానని నీకు నమ్మకం ఇవ్వగలను. కాబట్టి, నీకు ఆశీర్వాదం ఇస్తున్నాను, నీవు జీవితంలో ఎల్లప్పుడూ సంతోషంగా, విజయవంతంగా ఉంటావు. నువ్వు ఏది తాకినా అది బంగారం అవుతుంది నాయనా!” అని చెప్పాడు. ధరమ్ పాల్ కృతజ్ఞతతో నమస్కరించి, భక్తితో తన తండ్రి పాదాలను తాకాడు. తండ్రి ప్రేమగా కుమారుడి తలపై చేయి వేసి, సంతృప్తిగా, ప్రశాంతంగా తుది శ్వాస విడిచాడు.

ఇంటి ఖర్చులు చూసుకోవడం ఇప్పుడు కొడుకు ధరమ్ పాల్ బాధ్యత. అతను తోపుడు బండిపై  చిన్న వ్యాపారం ప్రారంభించాడు. వ్యాపారం సమయంతో క్రమంగా అందుకున్న తర్వాత, ఒక చిన్న దుకాణాన్ని కొన్నాడు. క్రమంగా, వ్యాపారం మరింత విస్తరించింది. త్వరలోనే  నగరంలోని సంపన్నులలో, ఐశ్వర్యవంతులలో అతను లెక్కించబడ్డాడు. ఇదంతా తన తండ్రి దీవెనల ఫలితమని అతను నిజంగా విశ్వసించాడు.

తన తండ్రి ఎన్ని కష్టాలు పడినా సహనాన్ని విడిచిపెట్టలేదు, విశ్వాసం కానీ,  ప్రామాణ్యతను కానీ  కోల్పోలేదు, అందువల్లనే ఆయన మాటలకు అలాంటి శక్తి ఉండి, ఆయన ఆశీర్వాదాలు ఫలించాయి. ధరమ్ పాల్ ఎప్పుడూ అందరికీ ఇలా చెప్తూ, తన విజయానికి తన తండ్రి ఆశీస్సులే కారణమని చెబుతూ ఉండేవాడు. ఒకరోజు ఒక స్నేహితుడు అడిగాడు, “మీ నాన్న అంత శక్తిమంతుడైతే, ఆయన ఎందుకు వృద్ధి చెందలేదు, ఎందుకు సంతోషంగా జీవించలేకపోయాడు?”

ధరమ్ పాల్ మాట్లాడుతూ, “మా నాన్న శక్తివంతమైన వ్యక్తి అని నేను చెప్పడం లేదు, ఆయన ఆశీస్సులు చాలా శక్తివంతమైనవని నేను చెబుతున్నాను.” ఎప్పుడూ తన తండ్రి ఆశీర్వాదం గురించి మాట్లాడటం వలన, అందరూ అతనికి ‘తండ్రి ఆశీర్వాదం’ అని పేరు

పెట్టారు. ధరమ్ పాల్ దీన్ని పట్టించుకోలేదు, తన తండ్రి ఆశీర్వాదాలకు అర్హుడిగా మారగలిగితే అదే తనకు గౌరవంగా ఉంటుందని చెప్పాడు.

సంవత్సరాలు గడిచిపోయాయి, ఇప్పుడు తన వ్యాపారాన్ని విదేశాలకు కూడా విస్తరించాడు. ఎక్కడ వ్యాపారం చేసినా పెద్ద లాభాలు వచ్చేవి. నేను ఎప్పుడూ లాభాలను ఆర్జిస్తున్నాను, నేను ఒక్కసారి నష్టాన్ని అనుభవించాలి అని ఒకసారి ధరమ్ పాల్ కుతూహలపడ్డాడు. ఒక నష్టపోయే వ్యాపారాన్ని సూచించమని తన స్నేహితుడిని అడిగాడు. ధరమ్ పాల్ విజయాన్ని, డబ్బుని చూసుకొని చాలా గర్వపడుతున్నాడని, ఆ స్నేహితుడు ఖచ్చితంగా నష్టపోయే వ్యాపారాన్ని సూచించాలి అని అనుకున్నాడు.

భారతదేశం నుండి లవంగాలను కొనుగోలు చేసి, వాటిని ఆఫ్రికాలోని జాంజిబార్‌కు రవాణా చేసి, అక్కడ విక్రయించమని సలహా ఇచ్చాడు. ధరమ్ పాల్‌కు ఈ ఆలోచన నచ్చింది. జాంజిబార్ లవంగాలకు చాలా ప్రసిద్ధి చెందింది. అవి అక్కడ నుండి భారతదేశంలోకి దిగుమతి చేయబడతాయి, ధర కూడా 10-12 రెట్లు అమ్ముడవుతుంది. వాటిని ఇక్కడ కొనుగోలు చేసి అక్కడ విక్రయిస్తే కచ్చితంగా నష్టమే. తన తండ్రి ఆశీర్వాదాలు అతనికి ఎంతవరకు సహాయపడతాయో చూడడానికి ధరమ్ పాల్ దీనిని ప్రయత్నించాలని నిర్ణయించుకున్నాడు. నష్టాన్ని అనుభవించడానికి, అతను భారతదేశంలో లవంగాలను కొని, వాటిని ఓడలో నింపి, స్వయంగా జాంజిబార్ ద్వీపానికి తీసుకెళ్ళాడు.

జాంజిబార్ ఒక సల్తనత్. ధరమ్ పాల్ ఓడ దిగి, వ్యాపారులను కలవడానికి పొడవైన ఇసుక దారిపై నడవడం ప్రారంభించాడు. అవతలి వైపు నుండి సైనికులతో పాటు కాలినడకన వస్తూ, సుల్తాన్ లాగా కనపడుతున్న వ్యక్తిని చూశాడు. ఎవరని వాకబు చేయగా ఆయన స్వయంగా సుల్తాన్ అని చెప్పారు. వారు ఒకరినొకరు ఎదురుపడ్డప్పుడు, ధరమ్ పాల్‌ను పరిచయం చేసుకోమని సుల్తాన్ అన్నాడు. అప్పుడు ధరమ్ పాల్ ఇలా చెప్పాడు, “నేను భారతదేశంలోని గుజరాత్‌లోని ఖంభాట్ నుండి వ్యాపారిని, వ్యాపారనిమిత్తం ఇక్కడకు వచ్చాను.”

- సశేషం

# శ్రీబాబు దివ్య రక్షణ

- భోగరాజు భారతీదేవి

శ్రీబాబు ఎప్పుడూ మనల్ని రక్షిస్తూనే వున్నారు. ఇప్పుడూ అమ్మ రూపంలో కంటికి రెప్పలాగా కాపాడుతూనే వున్నారు.

1973వ సంవత్సరంలో మా పెద్దపాప మూడునెలల చంటి పిల్లగా వున్నప్పుడు శ్రీబాబు దర్శనానికి ఆశ్రమానికి తీసుకువచ్చాము. బాబు ఎంతో చక్కగా దర్శనమిచ్చి తీర్థమిచ్చారు. పాప నోట్లో పోస్తే చప్పరించిందని 'మంచిపిల్ల' అన్నారు. పాపకు ఆరోగ్యం బాగోలేదని చెబితే, 'అనాస' అని చెప్పి, రాజమండ్రి తీసుకువెళ్ళి, అనాస ఆదినారాయణకు చూపించి, నేను పంపించానని చెప్పండి. మందులిస్తారు తగ్గిపోతుంది' అన్నారు. మేము శెలవు తీసుకుంటాము అంటే సరే వెళ్ళిరండి జాగ్రత్తగా వెళ్ళండి అన్నారు. మాతో భోగరాజు నరసింహమూర్తి బాబాయిగారు, మా బంధువుల అబ్బాయి కూడా వచ్చారు. బాబాయ్‌ని 'మళ్ళీ వస్తావుగా?' అన్నారు శ్రీబాబు. ఆ అబ్బాయి వీపు మీద చరిచి 'వెళ్ళిరండి' అన్నారు.

వెళ్తుంటే మేము ఎక్కిన టాక్సీకి ప్రమాదం జరిగింది. చీకటిగా వుంది. కారు చక్రం ఊడిపోయి, టాక్సీ కొంచెం దూరం అలాగే వెళ్ళిపోయి అక్కడ ఒక చోట ఆగింది. మేము బాబుని ప్రార్థించుకుంటున్నాము, నరసింహ మూర్తి బాబాయ్ ధ్యానం చేసుకుంటున్నాడు. బంధువుల అబ్బాయి రోడ్డు మీద పడిపోయాడు. బాబుగారు చరిచిన దెబ్బ స్పర్శవలన ఏమీ తగలలేదు. కొద్దిగా చేతికి గీరుకుంది. పసిపిల్ల నా ఒడిలో నుండి జారిపోయి సీటు క్రిందపడిపోయి క్షేమంగా వుంది. అందరినీ ఆపద్బాంధవుడు బాబు అలాగ రక్షించారు. 3వ రోజు పౌర్ణమికి నరసింహమూర్తి బాబాయ్ ఆశ్రమానికి వెళ్ళాడు. ప్రార్థన అవగానే సభలో శ్రీబాబు బాబాయ్‌ని లేపి, 'భగవానుడు ప్రహ్లాదకుమారుణ్ణి ఎలా రక్షించాడో, అలాగే మిమ్మల్ని, ఆ పసిపాపను కూడా రక్షించాడు కదా' అన్నారు. ఆ భగవానుడు ఎవరో కాదు, గురుభగవానుడే అని మేము ఎంతో ఆనందించాము. అప్పటి నుండి ప్రయాణంలో స్తోత్రాలు చదవడం అలవాటు చేసుకున్నాము.

# భక్త సూరదాసు

- సుషమ్నా ప్రసాద

మానవ జీవిత పరమార్థాన్ని తెలుసుకొని, ఆ లక్ష్యార్థ సాధన చేయడానికి కృషి చేయకపోతే, మానవుడిగా జన్మించినా ఒకటే, జంతువుగా జన్మించినా ఒకటే. భగవంతుడు మానవజన్మ ఒక వరంగా ప్రసాదించాడు. ఆ వరాన్ని మనం సద్వినియోగం చేసుకోకపోతే, **పునరపి జననం పునరపి మరణం** అనే సుడిగుండంలో పడి, మానవ జీవిత గమ్యానికి దూరమవుతాము. భక్తి అనే బాటలో పయనిస్తే, ముక్తి అనే శిఖరాగ్రమును చేరుకోగలుగుతాము. అందుచేతనే జగజ్జనని లలితా పరమేశ్వరిని **భక్తప్రియా, భక్తిగమ్యా, భక్తివశ్యా, భయాపహా** అని వర్ణించారు లలితా సహస్రనామ స్తోత్రంలో. భక్తులంటే ప్రియమైనది, భక్తి గమ్యాన్ని చేర్చేది, భక్తికి వశమై భయాలను పారద్రోలి, ఆనందమనే క్షీరమును ప్రసాదించే చల్లని తల్లి జగన్మాత.

భుక్తి మానవుని భౌతిక మనుగడకు ఆవశ్యకమైతే, భక్తి అనేది మానవుని ఆధ్యాత్మిక ప్రగతికి ఆవశ్యకమైనది. భక్తి అనే సోపానాలను అధిరోహిస్తే మనం ముక్తి అనే శిఖరాగ్ర సౌధాన్ని సులువుగా చేరుకుంటాము. అలా గమ్యాన్ని సులభంగా చేరుకొన్న భక్త శిఖామణి భక్త సూరదాసు. లౌకికమైన అంగవైకల్యము భక్త శిఖరాగ్రమైన ముక్తిని చేరుకొనడానికి ప్రతిబంధకము కాదని నిరూపించిన భక్తాగ్రగణ్యుడు భక్త సూరదాసు. ఆయన జన్మతః అంధుడు. కానీ, ఆ మహాభక్తుని నేత్రాలు కృష్ణజ్యోతితో ప్రకాశించేవి. ఒకసారి శ్రీకృష్ణుని ధామమైన బృందావనాన్ని దర్శించాలని సూరదాసుకు తీవ్రమైన కోరిక కలిగింది.

వెంటనే భక్తవత్సలుడు, భక్త ప్రియుడైన శ్రీకృష్ణపరమాత్మ తానే మార్గదర్శియై, బృందావన దర్శనం చేయించాడు. బృందావనంలో సూరదాసు శ్రీ వల్లభాచార్యులను దర్శించాడు. శ్రీవల్లభాచార్యులవారి దర్శనం సూరదాసు జీవితంలో మరపురాని మధుర ఘట్టము.

సూరదాసు ఆలపించిన భక్తిభావ భరితమైన మధుర గానం విని, పరవశించిపోయి, శ్రీ వల్లభాచార్యులు సూరదాసుని గాఢాలింగనం చేసుకున్నారు. ఆ గురుశిష్యుల కలయిక అపూర్వం! గురుమూర్తి శిష్యులకు మార్గదర్శి. గురుమూర్తి ప్రసాదించిన ఆదేశాన్ని, ఉపదేశాన్ని అచంచలమైన విశ్వాసంతో ఆచరించిన శిష్యుడు తప్పకుండా తరిస్తాడు.

గురుదేవుడైన వల్లభాచార్యుని గాఢ పరిష్వంగముతో పరవశించిన సూరదాసు గురుమూర్తితో శాంతిని పొందటానికి ఏదో తెలియని వెలతి తనను పీడిస్తున్నదని, దానికి పరిష్కారం ప్రసాదించమని ప్రార్థించాడు.

పరమానుగ్రహ మూర్తి, ప్రేమ స్వరూపుడైన వల్లభాచార్యులు, సూరదాసుకు చక్కని పరిష్కార మార్గం ప్రసాదించి, చక్కని ఆదేశాన్నిచ్చాడు. 'నాయనా సూరదాసూ! నీవు తులసీదాసు కథ వినే వుంటావు. ఆయన గొప్ప రామభక్తుడు. ఆయన వాడుక భాషలో అందరికీ అర్థమయ్యేటట్లు శ్రీరాముని చరిత్ర **శ్రీరామ చరిత మానస్** అని వ్రాశాడు. అలాగే లీలా మానుషుడైన శ్రీకృష్ణుడు తన చరిత్ర నీ ద్వారా ప్రజలకందాలని ఆశిస్తున్నాడేమో. ఈ మహత్తర కార్యము ఆలస్యం చేయకుండా, కృష్ణ భగవానుని ఆశయాన్ని నెరవేర్చు. అప్పుడు నీ వెలితి తీరిపోతుంది' అన్నారు. అందుకు సమాధానంగా సూరదాసు 'నాకు శక్తి జ్ఞానము లేవు స్వామీ!' అన్నాడు. వెంటనే వల్లభాచార్యులు సూరదాసుకు ప్రోత్సాహమిచ్చే ప్రబోధం చేసి కార్యోన్ముఖుణ్ణి చేశారు. సద్గురు పరమానుగ్రహమంత గొప్పది. 'శ్రీకృష్ణ పరమాత్మను నీ హృదయంలో నిలుపుకోగలగిన భక్తియే నీకున్న అర్హత. అంతకంటే గొప్ప అర్హత ఇంకేమి కావాలి? అయినా, నీ భయాన్ని పారద్రోలడానికి నీకు భాగవతమునకు హృదయస్థానమైన దశమస్కంధాన్ని నీకు వివరిస్తాను' అని చెప్పి సూరదాసు కోరికపై మంత్రోపదేశం చేసి, మార్గం చూపారు వల్లభాచార్యులు.

సద్గురుమూర్తి మనకు అండగా వుంటే సాధించలేనిదేమీ లేదని

నిరూపించాడు సూరదాసు. సద్గురుదేవుల ఆదేశానుసారము శ్రీనాథుని ఆలయంలోనే వుంటూ, లక్ష పద్యాలతో శ్రీకృష్ణుని మనోహరంగా వర్ణించాడు. గురువాజ్ఞను త్రికరణ శుద్ధిగా పాటించాడు. కాబట్టి అంగవైకల్యము అంధత్వం సూరదాసుకు అడ్డురాలేదు. అక్బరుపాదుషా మన్ననలను అందుకున్నాడు. కానీ, కీర్తి సంపదను ఆశ్రయించి బానిసకాకుండా, భక్తిని మించిన సంపద లేదని నిరూపించాడు. భక్త సూరదాసు నిండు నూరేళ్ళూ జీవించినట్లుగా తెలుస్తుంది. తన జీవిత నిష్క్రమణ ఎప్పుడో తెలుసుకున్న ధార్మికుడు. త్రికాలజ్ఞుడు కనుక శ్రీనాథుని దేవాలయంలో ప్రవేశించి, ధ్వజంవైపు చూపు సారించి, చివరగా 'నా మనస్సు, ఆత్మ రాధామయ మవగా, ఆ లీలా కృష్ణుని సన్నిధికి, వియోగం లేని చోటుకు తరలి వెడుతున్నాను.' ఇలా పాడాడు.

సూరదాసు నిష్క్రమణ నిశ్చల మనస్సుకు తార్కాణం. సద్గురుమూర్తి బాటలో పయనించి, గమ్యాన్ని చేరుకున్న సూరదాసు సంపదకు సంతృప్తికి మించిన సంపద మరేముంటుంది?

## *పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

* ***ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును*** *

**జూన్ 2022**

14 మంగళ - జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ.

23 గురు - శ్రీగురుదశమి - శ్రీ సద్గురుపాదపూజ.

**జులై 2022**

10 ఆది - తొలి ఏకాదశి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

13 బుధ - ఆషాఢ పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

23 శని - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ


భక్తుడు
మధుప
నారాయణ! నారాయణ! నిరంతరం నారాయణ నామాన్ని జపించే నాకన్నా ఈ లోకంలో భక్తులు ఎవరూ ఉండరు కదా!
1
నారదా! రామాపురంలో సుబ్బయ్య అని పరమ భక్తుడు ఉన్నాడని విన్నాను. నువ్వే వెళ్ళి అది నిజమో కాదో తెలుసుకుని రావాలి.
నాకన్నా పరమ భక్తుడా! చూద్దాం!
చిత్తం! అలాగే!
2


కేశవా! ఈరోజు
ఆరోగ్యంగా నిద్ర
లేచానంటే అది నీ
దయే తండ్రీ!
3


నారాయణా! ఇక
పొలానికి వెళ్ళే
సమయం
అయ్యింది.
4


మాధవా! నేను జల్లిన
విత్తనాలన్నీ
మొలకెత్తాయి, ఇది
నీ దయ స్వామీ!
5


గోవిందా! నీ కృప వల్ల
ఈ రోజంతా సవ్యంగా
గడిచింది. ఇక
హాయిగా నిద్రపోతాను.
6


నేను నిరంతరంగా
హరినామం చేస్తూ ఉంటే
నన్నొదిలేసి ఈ తాతగారు
గట్టిగా రోజుకి మూడు
నాలుగు సార్లు నామం
జపించే ఆ సుబ్బయ్యను
పరమ భక్తుడు
అంటారేమిటి? ఈ
కృష్ణావతారంలో ఈయనకు
వేపకాయంత వెర్రి కూడా
వచ్చినట్లుంది.
7
ఆ సుబ్బయ్య తమరు
చెప్పినంత గొప్ప
భక్తుడేమీ కాదు ప్రభూ!
ఏదో రోజుకి నాలుగైదు
సార్లు గుర్తొచ్చినప్పుడు
తమ నామాన్ని
స్మరిస్తున్నాడు అంతే!
తరువాతి కథ వచ్చే నెల ..
8

(గత సంచిక తరువాయి) **బరువులు** - హనుమత్ జయప్రద

ఇందులో మొదటి వాడి దగ్గర జ్ఞానం అనే రత్నం ఉండటం వలన, త్వరగా ఆ భగవంతుణ్ణి చేరుకోగలిగాడు. అయితే ఈ జ్ఞానధనము కేవలము అనుభవ స్వరూపులైన గురుదేవుల వద్దనే లభిస్తుంది. అట్టి ఆచార్యుడే కేవలం పరమాత్మస్వరూపుడు. మనలో ఉన్న కామ, క్రోధాది గుణాలు అనేటువంటి దొంగలు ఆ రత్నాన్ని దొంగిలించ చూస్తున్నాయి. అచంచల విశ్వాసం తో భగవంతుడిని ఆశ్రయిస్తే అయన ఈ దొంగలను పారద్రోలుతారు. **కామః క్రోధశ్చ లోభశ్చ దేహేతిష్ఠంతి తస్కరః జ్ఞానరత్నపహరయా తస్మాత్ జాగ్రత జాగ్రత.**

రెండో వాడు కర్మ యోగి. తాను చెయ్యగలిన కర్మ (ఈత) చేసి అవతలి ఒడ్డుకి చేరాడు. సమస్త కర్మలు నాయందే సమర్పించి, ఆశ గానీ, మమకారం గాని లేని వాడై నిర్భయముగా యుద్ధం చెయ్యి అని శ్రీ కృష్ణ పరమాత్మ చెప్పినట్టు అతను తాను చెయ్యాల్సింది చేసి తన గమ్యస్థానాన్ని చేరాడు. **మయి సర్వాణి కర్మాణి సన్యస్యాధ్యాత్మచేతసా నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః** (భగవద్గీత 3 .30)

మూడో వాడు భక్తుడు. స్వామీ! నాకేం తెలియదు అన్ని నాకు నువ్వే ...అంటే, ఆయనే స్వయంగా వచ్చి చేయి పట్టి గురుదేవుల రూపంలో ఈ సంసారసాగరాన్ని దాటిస్తున్నారు. ఏ భక్తులు కర్మలన్నింటినీ నాయందే సమర్పించి నన్నే అనన్య భక్తితో ఉపాసన చేస్తారో వారిని నేను మృత్యుసంసారము నుండి త్వరగా ఉద్ధరిస్తాను అని భగవద్గీత, భక్తియోగం లో స్వామి చెప్పారు.

**ఏతుసర్వాణి కర్మాణి మయి సన్యస్య మత్పరాః అనన్యేనైవ యోగేన మామ్ ధ్యాయంత ఉపాసతే తేషామహం సముద్ధర్తామృత్యు సంసార సాగరాత్-** 12 /6,7

కానీ కర్మబంధాలని మనంతట మనం తొలగించలేము, గురుదేవులు తొలగించగలరు అని తెలిసినా కూడా మళ్ళీ మళ్ళీ మనం ఈ జనన మరణ చక్రంలో పడి, మాయలో నలిగిపోతున్నాము. ఇతరులతో పూర్వజన్మలో మనకు రుణాలు, బంధాలు తీర్చుకోవడానికి ఈ జన్మలో భార్యగా, భర్తగా, సంతానంగా, తల్లిదండ్రులుగా, నౌకర్లుగా ఇలా రకరకాల బంధాలు తారస పడుతూ ఉంటాయి. ఆ ఇచ్చి పుచ్చుకునే ఋణం తీరగానే వారు దూరం అవ్వడమో, మరణించడమో జరుగుతుంది.

కొల్లూరులో మూగాంబికా అమ్మవారి దేవాలయం దగ్గర, ఒక అడుక్కునే బిచ్చగాడు ఉండేవాడు. పొద్దున్న నుండి రాత్రి దాకా అడుక్కుని వచ్చిన దానితో పిల్లల్ని చదివించాడు. మంచి వృద్ధిలోకి తెచ్చాడు. కానీ తాను సౌకర్యవంతంగా జీవితం గడిపితే బిచ్చం వెయ్యరని సాధారణ జీవితం గడిపేవాడు. ఒక రోజు ఒక మహాత్ముడు ఆ బిచ్చగాడి గురించి ఇలా చెప్పారు. పూర్వ జన్మలో ఇతను ఇద్దరు వ్యక్తుల దగ్గర డబ్బులు తీసుకుని, వాళ్ళు చాలా బాధలో ఉన్నప్పుడు తాను తిరిగి ఇవ్వగలిగే స్థితిలో ఉన్నా కూడా తిరిగి ఇవ్వలేదు. అందుకే ఈ జన్మలో తాను కష్టాలు పడుతూ వాళ్ళకి ఇవ్వాల్సిన ఋణాన్ని తీర్చుకుంటున్నాడు. అందువలన మన జన్మ జన్మల వాసనలు, ఒక్క మహాత్ముల వల్లనే దూరం కాగలవు. **దుర్లభం త్రయమే వైతద్దైవానుగ్రహహేతుకం మనుష్యత్వం ముముక్షత్వం మహాపురుష సంశ్రయః** వివేక చూడామణి. అటువంటి దుర్లభమైన సంపద, శ్రీ గురుమూర్తి రూపంలో మనదగ్గర ఉన్నందుకు మనం అందరం ధన్యజీవులం.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**జూన్ 2022**

14 మంగళ - జ్యేష్ఠ పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

23 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

**జులై 2022**

10 ఆది - తొలి ఏకాదశి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

13 బుధ - ఆషాఢ పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

23 శని - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి)

- రేఖ

శ్రీకృష్ణ పరమాత్మ ఆత్మతత్వం గురించి పలుమార్లు ఇదే చెబుతున్నారు. ఉపనిషత్ సారం భగవద్గీత. వేదాలసారం ఉపనిషత్తులు. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత భిన్నం కాదు. వీటన్నిటి సారం ఒక్కటే. శాస్త్రం కూడా ఇదే చెబుతోంది. వీటిల్లో వున్న జ్ఞానమంతా అవపోసన పట్టలేము. కానీ, ఈ సారం కేవలం సత్యగురు సమాశ్రయం, శరణాగతి వల్ల జీవుడికి సాధ్యమవుతుంది.

ఆత్మ కళ్ళు లేకుండా చూస్తుంది. చెవులు లేకుండా వింటుంది. కేనోపనిషత్తులో ఈ భావనను సంపూర్ణంగా వివరించారు. దేహ మనో బుద్ధులు అవి గ్రహించు విషయాలు, అనుభవించు అనుభవాలు ఇవేవీ ఆత్మకావు. వీటన్నింటికీ అతీతంగా వుండే ఆ పరమాత్మ ఈ ఉపకరణాల ద్వారా విషయాలన్నింటినీ తెలుసుకుంటోంది. కళ్ల ఎదుట విషయాలను ప్రకాశింపజేసేది ఆత్మయే. చెవులకి వినేశక్తినిచ్చేది ఆత్మే. కళ్ళు, చెవులు, కరణములు అన్నిటినీ తెలుసుకునేది ఆత్మ.

ఈ ఆత్మ కేవలం జ్ఞాన రూపం. **న చాస్తి వేత్తా మమ** - అంటే నన్ను తెలుసుకునే వాడు లేడు. బుద్ధిలోని భావాలను ఆ చైతన్యమే ప్రకాశింప జేస్తోంది. మంచి చెడు, జ్ఞానము అజ్ఞానము, జ్ఞాపకము మరపు, ఇంకేమైనా భావాలు మనో బుద్ధులలో ఉద్భవించగానే ఆ చైతన్యం వాటిని ప్రకాశింపజేసి, మనకు తెలియజేస్తోంది. ఆ చైతన్యమే అసలైన జ్ఞాత. అదే పరమాత్మ అని గురువు చెప్పే బోధలోని ప్రధాన విషయం. భగవద్గీత (15/15) శ్లోకంలో ఇదే విషయాన్ని శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి బోధించాడు...

**సర్వస్యచాహం హృదిసన్ని విష్టః। మత్త స్మృతిర్జ్ఞానం మపోహనం చ।**
**వేదైశ్చసర్వైరహమేవ వేద్యః వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ ॥**

వేదాంతాలలో వున్నటువంటి జ్ఞానం ఏదైతే వున్నదో అది 'నేను' అని తెలుసుకునే వాడను నేనే అని భగవానుడు చెప్పినట్లుగా గురువు శిష్యునికి **త్వమేవ తత్, తత్ త్వమేవ** అని బోధిస్తారు. అదే నీవు అని చెబుతారు.

గురువు చెప్పే విషయమంతా మనలను బయట విషయ ప్రపంచం నుండి లాగి అంతరాంతరాలలో వున్న బుద్ధి స్థానానికి

చేరుస్తుంది. కానీ బుద్ధిలో భావాలు కూడా చైతన్యం ప్రకాశింపజేసే విషయ ప్రపంచానికి సంబంధించినవే కానీ, నన్ను తెలుసుకుకున్న వారెవరూ లేరు. బాహ్యా ప్రపంచంలో నేను (పరమాత్మ) తెలుసుకునేందుకు విషయాలు వున్నాయి. కానీ, నన్ను (పరమాత్మను) తన జ్ఞాన విషయముగా తెలుసుకునే జ్ఞానమేదీ లేదు. 'నేను' పరమ వేత్తను, ఆ శుద్ధ చైతన్యమును. సర్వమూ నా (పరమాత్మ) యందే వున్నది. ఏ జ్ఞానమునకు 'నేను' విషయమును కాను. ఈ కరణాలతో గుర్తించే విషయాలతోటి ఆయనకు (పరమాత్మకు) సంబంధం లేదు.

**చిత్ సదాహం** అంటే నేను శుద్ధ జ్ఞాన స్వరూపుడను. నన్ను నేనే తెలిసికోవలసి వున్నది. 'నేను' (పరమాత్మ) జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాల కంటే భిన్నమైనదని చెప్పి, **వివిక్త రూపః** అనే పదం వాడి ఈ మంత్రంలో ఆత్మ మనస్సుకు, బుద్ధికి కూడా అతీతమైనదని అర్థం చెప్పారు. అందుకనే నన్ను తెలుసుకునే వాడు మరొకడు లేడు, శుద్ధ జ్ఞాన స్వరూపం నేనే అనే వాక్యాలు ఆ పరమాత్మను సూచిస్తున్నాయి.

**అపాణి పాదోహమచింత్య శక్తిః**
**పశ్యామ్యచక్షుః సశృణ్యోమ్య కర్ణః**
**అహం విజానామి వివిక్త రూపః**
**నచాస్తి వేత్తా మమ చిత్సదాహమ్ ॥** (శ్లో 21)

- సశేషం

**ముఖ్య గమనిక**

మే నెలలో సంకల్పించిన శ్రీకాళీవనాశ్రమ స్వర్ణోత్సవ కార్యక్రమాలు ప్రస్తుత కరోనా పరిస్థితుల దృష్ట్యా నవంబర్ నెలకు మార్చబడినవి. మరిన్ని వివరాలు తరువాత తెలియజేయబడును.

# సులభ మార్గం

- పాలూరి కాళీప్రసాద్

**ఘటోవా మృత్పిండోఽప్యణురపిచ ధూమోఽగ్నిరచలః**
**పటోవా తంతుర్వా పరిహరతి కిం ఘోరశమనం**
**వృథా కంఠక్షోభం వహసి తరసా తర్కవచసా**
**పదాంభోజం శంభోర్భజ పరమసౌఖ్యం వ్రజ సుధీః**

ఎంత గొప్ప చదువులు చదువుకున్నా, ఎంత పెద్ద గ్రంధాలు తల్లక్రిందులుగా అప్పజెప్పగలిగినా అవి నీ నిజ జీవిత గమనానికి వుపయోగపడనప్పుడు అవన్నీ వ్యర్థమే కదా! అలాగే సకల వేదాలను, తర్క మీమాంసాది శాస్త్రాలను ఔపోసన పట్టినా కేవలం వాటిని కంఠస్థం చేయడంతోనే ఆగిపోతే అది వ్యర్థం. విద్యయొక్క పరమార్థం ఆత్మజ్ఞాన ప్రాప్తి, తద్వారా మోక్షఫలాన్ని అందుకోవటం. అది వదిలేసి శాస్త్ర చర్చలలో కాలం గడపడం వృథా కంఠక్షోభ అని జగద్గురువులు శ్రీ ఆది శంకర భగవత్పాదాచార్యుల వారు పైన ఉదహరించిన శివానంద లహరిలోని ఆరవ శ్లోకం ద్వారా తెలియజేస్తున్నారు.

రకరకాల ఆకారాలలో కుండలు కనిపిస్తున్నా అవన్నీ మట్టితో చేసినవే. రకరకాల నగలు కనిపిస్తున్నా అవన్నీ బంగారంతో చేసినవే. వివిధ వర్ణాలలో అందమైన వస్త్రాలు కనిపిస్తున్నా అవన్నీ దారంతో చేసినవే. అదే విధంగా ఈ చరాచర ప్రకృతి విభిన్న అకృతులలో కనిపిస్తున్నా దానిని ప్రకాశింపజేసే ఆత్మ ఒక్కటే అని, దానిని గుర్తించమని వేదాంతం చెబుతున్నది. అది గుర్తించినవాడు సర్వత్రా ఆ సర్వేశ్వరునే దర్శిస్తూ, ఏ జీవికి ఎటువంటి హానిని కలుగజేయకుండా, అందరియెడ నిష్కారణమైన ప్రేమను కురిపిస్తూ ఉంటాడు. అయితే అది గుర్తించి అనుభవంలోనికి తెచ్చుకోకుండా కేవలం ఆయా శ్లోకాలను వల్లెవేస్తూనో, లేదా ఈ శాస్త్రంలో ఇలా చెప్పబడింది, మరి ఆ శాస్త్రంలో అలా ఎందుకు చెప్పారని వాదించుకుంటూనో జీవితం గడిపేస్తే మరి ఆ జీవితం వ్యర్థమే కదా.

నదిని దాటడానికి అనేక మార్గాలు ఉంటాయి. అయితే నదిని దాటడం మానివేసి, నీవు పట్టుకున్న మార్గం, లేదా సాధనం మీద మోహం పెంచుకొని, దానినే పట్టుకొని వ్రేళ్ళాడితే నీవు గమ్యం చేరేదెప్పుడు? మా

మార్గం గొప్పదంటే, కాదు మా మార్గమే గొప్పదని, అలాగే అందరు దేవుళ్ళ కంటే మా దేవుడే గొప్పవాడని - ఇలా వాదించుకునే వారు సాధించేదేముంది? అలా కాక సద్బుద్ధి కలిగిన వారు తాము ఆశ్రయించిన, విశ్వసించిన పరమాత్ముని పాదపద్మాలపై మనస్సును లగ్నం చేసి చాలా సుఖంగా ఈ సంసార జలధిని దాటిపోతారు.

భక్తిలేని జ్ఞానం శిరస్సులేని మొండెంలాంటిది. దానివలన సాధించేది ఏమీ లేదు. అసలు భక్తి అంటూ ఉంటే అది ఎప్పటికైనా పరాకాష్ట స్థితిని చేరి జ్ఞానంగా పరిణమిస్తుంది. ఇది సహజ జ్ఞానం. భక్తిలేని జ్ఞానం పుస్తక జ్ఞానంగానే మిగిలిపోతుంది. ఒక బంగారం కొట్టు యజమాని సహజంగానే తన కొట్టులోని బంగారు నగలన్నింటిలో వాటి వాటి ఆకార వికారాలను కాక బంగారాన్నే చూస్తాడు. అది ఏ పుస్తకంలోనూ చదువుకొని సంపాదించిన జ్ఞానం కాదు కదా. పైకి కొనుగోలుదారులతో ఎన్ని విధాలుగా ఆ నగల గురించి చర్చిస్తున్నా లోపల అతని మనస్సు సదా వీలైనంత ఎక్కువ బంగారాన్ని అమ్మి ఎక్కువ లాభం పొందాలనే ఉంటుంది. అలా కాక ఉన్నది నగలు కాదు, బంగారమే అని ఎన్నిమార్లు వల్లెవేస్తే మాత్రం ఆ దృష్టి వస్తుందా?

పరమానందయ్య శిష్యుల కథలలో ఒకదానిలో వారు ఒక పాత్రలో నెయ్యి పోయించుకొని 'పాత్రకు ఘృతం ఆధారమా? ఘృతానికి పాత్ర ఆధారమా?' అనే వాదనలో పడి చివరికి తమ చేతిలోని నేతిని మొత్తం నేలపాలు చేసుకుంటారు. అలా కాక వారు ఆ నేతిని వుపయోగించుకొని ఉంటే ఎంత ఆనందాన్ని అనుభవించేవారు? అలాగే ఆత్మ వస్తువు తనలోనే ఉండగా దానిని అనుభవంలోనికి తెచ్చుకోకుండా ఆ ఆత్మ గురించి ఏ శాస్త్రంలో ఎలా చెప్పబడింది అనే తర్క చర్చలలో మునిగి తేలుతూ కాలం వృధా చేసుకుని చివరికి మట్టిపాలైపోతే ఏమి ప్రయోజనం?

అందుకే శ్రీగురుదేవులు "శ్లోకం లోకంలో పడితే శోకమే" అనేవారు. ఆత్మతత్వాన్ని ప్రత్యక్షంగా తెలుకోవటం కష్టమని వేదాంతంలో అనేక ప్రమాణాలు చూపించారు. అందులో ఏదో ఒక దానిని పట్టుకొని, తద్వారా ఆత్మ ఉన్నదని, అదే తన నిజస్వరూపమని గుర్తెరిగి, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటం మానేసి, ఫలానా విషయం ప్రత్యక్ష

ప్రమాణమా, లేక అనుమాన ప్రమాణమా, దీనికి ఉపాదాన కారణం ఏమిటి, నిమిత్త కారణం ఏమిటి? అనుకుంటూ వృధాగా కంఠక్షోభను పొందటం ఎంతవరకు సమంజసం అని జగద్గురువులు మనలను ప్రశ్నిస్తున్నారు. ఈ కలియుగంలో మోక్షం పొందడానికి ఒకేఒక్క మార్గం, అతి సులువైన మార్గం భగవన్నామ స్మరణం. ఇంత తేలిక మార్గాన్ని వదలివేసి అనవసరమైన తర్క వ్యాకరణాది శాస్త్ర చర్చలలో, కంఠోపాఠాలలో పడి జీవితం వ్యర్థం చేసుకోవద్దని ఇటు శివానంద లహరిలో, అటు భజగోవింద శ్లోకాలలో కూడా వారు హెచ్చరిస్తున్నారు.

---

## శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జూన్ 2022**

8 బుధ - శ్రీసుగుణప్రసాద మాతాజీవారి పంచదశవార్షికారాధన. సత్సంగం.

14 మంగళ - జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

23 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

27 సోమ - మాస శివరాత్రి

28 మంగళ - అమావాస్య

**జులై 2022**

10 ఆది - తొలి ఏకాదశి - ఏకాహం సంకీర్తన, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

13 బుధ - ఆషాఢ పూర్ణిమ - గురుపూర్ణిమ, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

17 ఆది - దక్షిణాయన పుణ్యకాల ప్రారంభము

23 శని - శ్రీ గురుదశమి, మాసశివరాత్రి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

28 గురు - అమావాస్య

31 ఆది - శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

# శ్రీ మాతా కళావతి దేవి

సేకరణ - మురళి

(గత సంచిక తరువాయి)

ఆమె జీవితానికి నిర్దేశింపబడిన లక్ష్యం ఇంకా పూర్తికాలేదని, ఆధ్యాత్మిక అభ్యున్నతి ద్వారా ప్రజల బాధలను ఉపశమింపజేయుటమే ఆమె ధ్యేయమని బోధించారు. ఆమెను హుబ్లీ మఠానికి వెళ్ళమని, ఆమె బాధలు త్వరలోనే తీరగలవని బోధించి, అదృశ్యమయ్యారు. తన గురుదేవుల ఆజ్ఞను తాను ప్రత్యక్షంగా అనుభవించి, ఆత్మహత్యా ప్రయత్నాన్ని విరమించి, అత్తవారింటికి చేరుకున్నది. తన వస్తువులన్నీ బీదసాదలకు దానం చేసింది. తండ్రి వచ్చి ఆమెను గోకర్ణం తీసుకుని వెళ్ళాడు. కొద్ది రోజుల తరువాత ఆమెకు రెండవ కుమారుడు జన్మించాడు.

రుక్మాబాయి కష్టాలు అంతటితో ఆగలేదు. కొద్ది రోజుల తరువాత తండ్రి, మామగారు కూడా దివంగతులు అయ్యారు. రుక్మాబాయి చాలా దుఃఖపడింది. ఆమెలో విచారం ఇనుమడించింది. పూర్తిగా ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్ళిపోవాలనే కోరిక మరింతగా దృఢపడింది. పునర్వివాహానికిగానీ, ఉన్నత చదువులకు గానీ ఆమె సుతరామూ అంగీకరించలేదు. కొన్ని రోజుల తరువాత రుక్మాబాయి కట్టుబట్టలతో ఇల్లు వదిలి సిద్ధారూఢ స్వామి వారి మఠానికి చేరుకుంది. గురుదేవులు ఆమెను అత్యంత ఆత్మీయతతో ఆహ్వానించి, 'నీ రాకకోసం ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నాను' అన్నారు. స్వామివారి మాటలతో రుక్మాబాయి చాలా ఉపశాంతిని పొందినది. రుక్మాబాయి తల్లి ఆమె కోసం అనేక చోట్ల వెతికించింది. చాలా కాలానికి రుక్మాబాయి జాడ తెలిసి, పిల్లలిద్దరినీ, కొంతమంది బంధువులను కూడా తీసుకుని హుబ్లీ మఠానికి వచ్చి, శత విధాల ప్రయత్నించింది రుక్మాబాయిని తిరిగి ఇంటికి తీసుకు వెళ్ళాలని. తల్లి ప్రయోగించిన సామ, దాన, భేద, దండోపాయాలు రుక్మాబాయి మనస్సును మార్చలేకపోయాయి. తిరిగి ఇంటికి వెళ్ళడానికి రుక్మాబాయి సుతరామూ అంగీకరించలేదు. తల్లి, ఇతర బంధువులు నిరాశతో తిరిగి వెళ్ళిపోయారు.

రుక్మాబాయి ఆశ్రమంలో కనీస అవసరాలతో చాలా నిరాడంబరంగా జీవించేది. కొంతకాలం కేవలం ఒక్క చీరతోనే సరిపెట్టుకునేది. ఈ విషయం గురువుగారి దృష్టికి వెళ్ళినప్పుడు ఆమెకు సరిపడా వస్త్రాలు ఇచ్చారు. ఆహారం చాలా మితంగా తీసుకునేది. తరచు

ఉపవాసాలు వుండేది. ఒక్కొక్కసారి వారం రోజులు కూడా ఉపవాసం వుండేది. ఇటుకలను దిండుగా పెట్టుకుని, జనపనార సంచులపై పడుకునేది. అయినప్పటికీ ఆమె గురునామం తైలధారవలె స్మరిస్తూ వుండేది. నిత్య ప్రార్థనలలోను, కార్యక్రమాలలోను, ఆశ్రమ సేవలోను ఎంతో ఉత్సాహంతో తప్పక పాల్గొనేది. అత్యవసరమైతే తప్ప ఎవరితోనూ మాట్లాడేది కాదు. ఆమె మనస్సు, శరీరాన్ని కూడా పూర్తిగా తన ఆధీనంలో వుంచుకుని, గురుదేవుల అనుగ్రహంతో జ్ఞానోదయానికి సిద్ధపడి వుంది.

రుక్మాబాయి స్వచ్ఛమైన మనస్సు, గురుదేవుని యందు సంపూర్ణమైన విశ్వాసం, దైవిక జ్ఞానాన్ని సంపాదించడానికి ఉత్సాహం, పరిణతి చెందిన ప్రవర్తన, ఆధ్యాత్మిక ఇతివృత్తాల సారాన్ని తెలుసుకోగల సామర్థ్యం, వాగ్ధాటి, సమాచారాన్ని గ్రహించగల సామర్థ్యం మరియు ధ్యాన సమయంలో పొందే నిశ్చల స్థితి, నిర్లిప్తత, పనులను సమర్థవంతంగా చేయగల సామర్థ్యం, స్థిరమైన భక్తి మరియు అన్నిటికంటే సన్యాసం వంటి గుణాలు  ఆమె పట్ల గురుదేవుల సంపూర్ణ అనుగ్రహానికి దోహదమయ్యాయి. 1928వ సంవత్సరం విజయదశమి రోజున గురుదేవులు ఆమెను వేదిక మీదకు ఆహ్వానించి, 'కళావతీ దేవి' అనే నామం ఇచ్చి, శాలువాతో సత్కరించి, ప్రసాదం యిచ్చి, భక్తులకు ఆధ్యాత్మిక సందేశం ఇవ్వవలసినదిగా కోరారు. ఇది ఆమెకు అత్యున్నతమైన సన్మానం!

శ్రీ గురుదేవుల ఆజ్ఞ మేరకు కళావతీదేవి 'నామ్ సంకీర్తన్ సాధన్ పై సోప్' - పవిత్ర నామాన్ని జపించడం మరియు ప్రభువును స్తుతించడం మోక్షానికి సులభమైన మార్గం అని పాడుతూ రెండున్నర గంటలసేపు ఇచ్చిన ఉపన్యాసం శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసింది. ఒకరోజు ఆమె భజన చేస్తున్న సమయంలో భగవంతుని దర్శనం కోసం ఆర్తితో భావోద్వేగానికి గురియై, 'ప్రభూ! నీ దివ్య దర్శనం అనుగ్రహించవా! నీ దర్శనం తప్ప నేను వేరే ఏమీ కోరటం లేదు. నీ దర్శనం పొందలేకపోతే, ఈ జన్మ వ్యర్థం కదా' అంటూ కన్నీరు మున్నీరై విలపిస్తుండగా గురుదేవులు ఆమె వద్దకు వచ్చి, ఆమె తలపై తమ హస్తాన్ని వుంచి, ఆశీర్వదించగానే కళావతీ దేవి సమాధిస్థితిలోకి వెళ్ళి ఆత్మానందాన్ని పొందారు.

- సశేషం

## వివేక చూడామణి సేకరణ - రమణ ప్రసాద్

మననం చేయదగ్గ శ్లోకములు

ది.22-3-2022 నుండి ది.6-5-2022 వరకు పూజ్య శ్రీ మాతాజీ వారి దివ్యాశీస్సులతో డాక్టర్ ఆచార్య శ్రీ అశోక్ వర్మ ప్రసాద్ గారు శ్రీ ఆదిశంకర భగవత్పాదాచార్య స్వామివారు రచించిన "వివేక చూడామణి" అనే ప్రకరణ గ్రంథం పైన శ్రీ కాళీవనాశ్రమంలో ప్రవచనం చేశారు, శ్రీ బాబూజీ మహరాజ్ వారు, యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారు తమ దివ్య భాషణలలో తరచు ఉల్లేఖించిన శ్లోకాలపై విశేషంగా ప్రసంగించారు. కొన్ని ముఖ్యమైన శ్లోకాలను భక్తులచేత మననం చేయించారు. ఆ శ్లోకాలని "సమర్థ సద్గురు" పాఠకుల సౌలభ్యం కోసం ప్రచురిస్తున్నాము.

**బ్రహ్మ భావన**

**జాతి నీతి కుల గోత్ర దూరగం**
**నామరూపగుణ దోష వర్జితమ్.**
**దేశకాల విషయాది వర్తియత్**
**బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥ 255**

ఆ పరబ్రహ్మము మనుష్య పశు పక్ష్యాది జాతులతోగాని, కుల గోత్రాలతోను, రూప నామ గుణ రహితముగా, దేశ కాల విషయాలకు అతీతముగా ఉన్న ఆ పరబ్రహ్మము నీవే. "నేనే పరబ్రహ్మము" అని సదా భావింపుము.

**యత్పరం సకల వాగగోచరం**
**గోచరం విమలబోధ చక్షుషః,**
**శుద్ధ చిద్ఘనమనాది వస్తు యత్**
**బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥ 256**

ఆ పరబ్రహ్మము వాక్కునకు అందనిది, జ్ఞాన నేత్రమునకు మాత్రము గోచరమైనది, వేదములు వర్ణింపజాలనిది. శుద్ధ చైతన్య ఘనము, అనాది అయిన ఆ పరబ్రహ్మము నీవే. "నేనే పరబ్రహ్మము" అని సదా భావింపుము.

**షడ్భిరూర్మిభిః అయోగియోగి హృత్**

**భావితం న కరణైర్విభావితమ్,**

**బుద్ధ్యవేద్య మననద్యభూతి యత్**

**బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥ 257**

ఆ పరబ్రహ్మము షడూర్ములు (శోకమోహములు, క్షుత్పిపాసలు, జనన మరణములు) లేనిది, షడూర్ములను జయించిన యోగి హృదయాలలో భాసించునది, బుద్ధికి అందనిది అగు ఆ పరబ్రహ్మము నీవే. "నేనే పరబ్రహ్మము" అని సదా భావింపుము.

**భ్రాంతి కల్పిత జగత్కలాశ్రయం**

**స్వాశ్రయం చ సదసద్విలక్షణమ్,**

**నిష్కళం నిరుపమానమృద్ధిమత్**

**బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥ 258**

భ్రాంతి కల్పితమైన జగత్తుకు జగత్కార్యములకు ఆధారమైనది, సత్తు చిత్తులకు భిన్నముగా ఉండునది, అవయవ రహితమై, నిష్కళమై, ఉపమాన రహితమై సర్వదా పూర్ణమగు ఆ పరబ్రహ్మవు నీవే. "నేనే పరబ్రహ్మము" అని సదా భావింపుము.

- సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జూన్ 2022 :*** AS 7470, 7482, 7779, 8731-8736, 8739, 8746-8755, 8757-8764. LM 4335, 4337, 4338•

***జులై 2022 :*** AS 3728, 3908, 6405, 7490-7495, 7511, 7909, 8765-8767, 8769-8772, 8774, 8776, 8777, 8779-8784, 8786-8819, LM 4339

# గురువు

- బొంబాయి కృష్ణారావు

**గురువను రెండక్షరములు ఋజు మార్గముతెలిపే**
**గురువను రెండక్షరములు నరులకు లైటుజూపే**
**గురువను రెండక్షరములు జనులకు సమత్వము నేర్పే**
**గురవను రెండక్షరములు జీతభత్యములు సమగూర్చే నెల్లరకు**
**గురువను రెండక్షరములు రతి మతులకు నిరతి గతినొసంగె.**
**గురువను రెండక్షరములు చిత్ జడముల విడమరిచితెల్పే**
**గురువను రెండక్షరములు శిష్య భానుకిరణములతో**
**విశ్వజ్యోతి ప్రజ్వలింపజేసే.**
**గురువులు అరూపులైన నేమి, ఆ రెండక్షరములు**
**శిరోధార్యములెల్లరకీ జగతిన్.**
**రూపులైన, అరూపులైన మన గురువులుమన మనమున**
**అమరులై వసింతురు వివేకమీయగన్.**



(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

అప్పుడు విశ్వామిత్రుడు......

**గృహాణ వత్స సలిలం మా భూత్ కాలస్య పర్యయః ॥**

**మంత్ర గ్రామం గృహాణ త్వం బలాం అతిబలాం తథా ॥**

బ్రహ్మ దేవుని కుమార్తెలైన బల, అతిబల అనే రెండు మంత్రాలని వాళ్ళకుపదేశించాడు. "ఈ రెండు విద్యల చేత మీకు ఆకలి వెయ్యదు, దప్పిక కలగదు, మీరు నిద్రపోతున్నప్పుడు కాని, నిద్రపోనప్పుడు కాని రాక్షసులు మిమ్ములను ఏమి చెయ్యలేరు, దీనితో పాటు మీకు సమయస్ఫూర్తి, జ్ఞాపక శక్తి కలుగును, బుద్ధి ప్రకాశిస్తుంది" అని చెప్పాడు.

తరవాత దర్భగడ్డి పరిచి వారిద్దరినీ దాని మీద పడుకోమన్నాడు. ఇద్దరు హాయిగా పడుకున్నారు. సూర్యోదయమునకు ముందుగనే నిద్రలేచిన విశ్వామిత్రుడు, సంధ్యావందనాది కార్యక్రమాలు ముగించుకుని, పిల్లలిద్దరి దగ్గరికి వచ్చి చూశాడు. వాళ్ళు నిద్రపోతున్నారు. ఒక్క క్షణం, నిద్రపోతున్న రాముని దివ్యసౌందర్యాతిశయమును గాంచి మైమరచిపోయి, 'ఈ బాలుని కన్న కౌసల్యతల్లి ఎంతటి భాగ్యవంతురాలో?' యని తలచి, మెల్లగా ఆతనిని నిద్రనుండి లేపారు.

**"కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే।**

**ఉత్తిష్ఠ నర శార్దూల కర్తవ్యం దైవమాహ్నికం ॥"**

"కౌసల్య గర్భమందు జన్మించిన ఓ రామ! తూర్పు దిక్కున సూర్యుడు ఉదయిస్తున్నాడు కనుక నువ్వు నిద్రలేచి ప్రొద్దున్న ఆచరించదగు పూర్వ సంధ్యా వందనం చెయ్యాలి. రాక్షసులను సంహరించగల నువ్వు నరులలో శార్దూలం వంటివాడివి, దైవీ సంబంధమైన ఆహ్నికములను నెరవేర్చడానికి శుభప్రదమైన సమయం మించిపోకూడదు, అందుకని రామా! నీవు నిద్రనుండి లెమ్ము!."

నిద్రనుండిలేచిన రామలక్ష్మణులు పూర్వసంధ్యావందనాదులను ముగించుకుని, విశ్వామిత్రులతో కలసి ఒక దట్టమైన వనమును చేరుకున్నారు. విశ్వమిత్రులు వారికి పలు అస్త్ర, శస్త్రవిద్యలను నేర్పించి, కొన్ని మంత్రములనుపదేశించారు. అవి నేర్చిన పిదప వారు,

తామాచరించవలసిన కార్యమేమిటని విశ్వామిత్రుని కోరగ, ఆతడు రాక్షసవధకు సమయమాసన్నమైందని గ్రహించి, చిరుమంద హాసముతో, "రాక్షసులు వచ్చు వేళయ్యింది.. ముఖ్యముగ 'తాటకి' యను రాక్షసి వచ్చి చేసే పలు మాయాజాలములను వారికి వివరించి చెప్పి, దానిని సంహరించవలసినది'' అని కోరారు. ఆయన అలా రామలక్ష్మణులకు వివరించుచుండగనే, పెద్ద బండరాళ్లను భూమిపైకి నెట్టుకొనుచూ, భీకర ఆకారము కలదై, ఘోరాట్టహాసము చేయుచు, తాటకి రానే వచ్చింది.

''రామా! ఈమెయే తాటకి. లంకాధిపతి రావణుని ఆజ్ఞానుసారము, ఈమె ఇక్కడే బసచేస్తూ విశ్వక్షేమము కొరకు మునులు ఆచరించు తపస్సులకు, యాగములకు పలు విధములుగ ఆటంకమును కలిగిస్తున్నది. మొదట ఈమెను యమలోకమునకు పంపించు" అన్నారు విశ్వామిత్రులు.

కులగురువులను మనసున ధ్యానించి, విశ్వామిత్రునికి ప్రణమిల్లి, బాణం ఎక్కుపెట్టిన రాముడు ఒక్క క్షణకాలము తాటకివైపు చూశాడు. 'ఈమె ఒక స్త్రీ కదా? ఈమెను సంహరించడం తగునా!?' యని ఒక క్షణం తటపటాయించిన రాముని ఆలోచన గ్రహించిన విశ్వామిత్రుడు, "రామా! పూర్వకాలంలో సుకేతు అనే యక్షుడికి పిల్లలు లేకపోవుటచేత బ్రహ్మనుగూర్చి తపస్సు చేశాడు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై "నేను నీకు కొడుకులను ఇవ్వను, ఒక కూతురుని ఇస్తాను, ఆమె కామరూపి, మహా అందగత్తె, ఆమెకి 1000 ఏనుగుల బలముంటుంది" అని వరం ఇచ్చాడు. ఆమె పేరు తాటక. ఆమెకి యవ్వనం వచ్చాక సుందుడికిచ్చి వివాహం చేశారు. వాళ్ళకి మారీచుడు జన్మించాడు. 1000 ఏనుగుల బలం వుండడం వలన, గర్వంతో, అరణ్యంలో ఇష్టమొచ్చినట్టు తిరిగేవాళ్ళు. ఒకనాడు సుందుడు అగస్త్య మహర్షి మీద దాడికి దిగాడు. ఆయనకి ఆగ్రహం వచ్చి సుందుడిని సంహరించారు. ఇది గమనించిన తాటక తన కుమారుడితో కలిసి అగస్త్య మహర్షి మీదకి వచ్చింది, అప్పుడాయన తాటకని, 'నీకు వికృతరూపం వచ్చుగాక!' అని, మారీచుడిని 'ఈ దినమునుండి రాక్షసుడివి అవుతావని' శపించారు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ కొండ శేషంరాజుగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి)

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్



అప్పుడు శేషంరాజు గారు విజయవాడలో పని చేస్తున్నారు. వివాహాల సందర్భంగా వారున్న మేడ ఎదుట ఒకటి, మేడపైన ఒకటి రెండు పందిళ్ళు వేయించారు. బ్రహ్మాండమైన ఏర్పాట్లు జరిగాయి. వివాహ ముహూర్తానికి ముందు ఒక పందిరి కూలిపోయింది. కాని ఎవరికీ ఎటువంటి హానీ జరుగలేదు. శేషంరాజు దంపతులు అది అపశకునమని భావించి బాబు వద్దకు పరుగెత్తుకుని వచ్చారు. శ్రీ బాబు "ఇది చాలా శుభ శకునం. భయపడకండి. వివాహాలు నిశ్చింతగా జరపండి" అన్నారు. శేషంరాజుగారు అలాగే చేశారు.

వివాహాలు అయిపోయిన కొంతసేపటికి రెండవ పందిరి కూడా కూలిపోయింది. అప్పటికి పందిరి క్రింద జనం ఎవరూ లేరు. శేషంరాజు గారు మాత్రం పందిరి క్రింద మడత మంచం మీద కూర్చుని ఉన్నారు. పందిరి పడిపోతున్నదని గమనించి వెంటనే ఆ మంచం క్రిందికి దూరారు. ఎవరికీ ఏ అపకారమూ జరుగలేదు. కాని శేషంరాజు దంపతులకు గండెలలో గుబులు బయల్దేరింది. ఇద్దరు కుమార్తెల వివాహాలు ఎటువంటి సందర్భంలోను ఒకేసారి, ఒకేచోట జరుపరాదని, అది మహాదోషమని శాస్త్రం స్పష్టంగా చెబుతున్నది. ఇదంతా ఆ దోషానికి సూచన యేమో! ముందు ముందు యింకేమి అనర్థాలు జరుగుతాయో! ఈ ఆలోచనలు బలపడుతున్న కొలది, వారికి గుండెలలో దడ పుట్టింది. ఇక ఉండబట్టలేక వాళ్ళు మళ్ళీ శ్రీ బాబు వద్దకు వెళ్ళి మొరబెట్టుకున్నారు.

శ్రీబాబు వారిని దగ్గరకు తీసుకొని "భయపడకండి, మీకెవరికీ ఎటువంటి హానీ జరుగబోదు. విధి లీలలు చాల విచిత్రంగా ఉంటాయి నాయనా! మనం బాహ్య దృష్టితో చూసి, విచారించి, చాలా

శుభప్రదమని భావించినది ఒక్కొక్కసారి ఎంతో అనర్థాన్ని తెచ్చి పెడుతుంది. అలాగే మన బాహ్య దృష్టికి చాల అనర్థమని తోచినది, చాల శుభాన్ని కలిగిస్తుంది. ఆ శుభాశుభ ఫలితాలకు కారణం అప్పుడు చేసిన కర్మలు కాదు; అవి ఏ పూర్వ కర్మలకో చెందిన ఫలితాలు. దీనికి ఉదాహరణగా మీకొక కథ చెబుతాను.

ఇద్దరన్నదమ్ములుండేవారు. అన్న ఒక దేవాలయంలో తమకు వంశ పారంపర్యంగా వచ్చిన అర్చకత్వమును భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటూ , బీద కుటుంబం కావటం వలన, జాగ్రత్తగా అర్చకత్వం ద్వారా లభించిన దానితో కుటుంబ పోషణ చేసుకుంటూ వస్తున్నాడు. తమ్ముడు మాత్రం జులాయిగా తిరుగుతూ అన్న సంపాదించిన దాన్ని కూడా ఖర్చుపెడుతూ ఉండేవాడు. వాడికి దేవుడంటే భక్తి లేకపోగా, ఒకింత నిర్లక్ష్యం కూడా ఉండేది.

ఒకరోజు అన్నగారు గుడికి వెళ్ళి పూజ కోసం ఆవరణలో ఉన్న పూల చెట్ల వద్ద పూలు కోస్తున్నాడు. అప్పుడు అతని కాలికి ఒక ముల్లు గుచ్చుకుని బాగా నొప్పి చేసింది. బాధతోనే పూజ ముగించుకొని వచ్చి గుడి బయట అరుగు మీద కూర్చున్నాడు.

అంతలో తమ్ముడు గుడి ప్రక్క నుంచి తాంబూలం నములుతూ వెడుతూ, అక్కడే ఉమ్మివేశాడు. ఆ సమయంలో అతనికి అక్కడ ఒక బంగారపు ఉంగరం దొరికింది. అతడు నవ్వుకుంటూ అరుగు మీద కూర్చున్న అన్న వద్దకు వచ్చి వెక్కిరింపుగా "చూశావా అన్నయ్యా! మీ దేవుడి గొప్పతనం? నీ భక్తి శ్రద్ధలకు ఫలితంగా నీకు ముల్లు గుచ్చుకుంది. నా నిర్లక్ష్యానికి బహుమతిగా నాకు ఉంగరం దొరికింది. ఎలా ఉంది?" అంటూ వెళ్ళిపోయాడు.

అన్నయ్య మనస్సులో తుఫాను మొదలైంది. "నిజమే! ఇంత కష్టపడి గుడిని, యింటిని సమర్థించుకుంటూ వస్తున్న నాకు మిగిలింది దు:ఖమూ, బాధానా? దేనినీ లెక్క చేయకుండా దులుపుకుని తిరిగే వాడి బ్రతుకు అలా దర్జాగా జరగటమా? ఇదేనా నా భక్తి శ్రద్ధలకు ఫలితం? ఇదేనా దేవుడి న్యాయం? " అని యిలా తనలో చెలరేగుతున్న తిరుగుబాటుకు తట్టుకోలేక కన్నీరు పెట్టుకుంటున్నాడు అన్నయ్య. అతను నమ్ముకున్న భగవానుడు అతనికి శాంతి కలిగించకుండా ఉండగలడా?

- సశేషం

విష్ణు  కథలు -రమణ ప్రసాద్

# శ్రీ రమణ మహర్షి

సమస్త ధరామండలం జలప్రళయంలో మునిగి పోతుంటే పరమేశ్వరుడు ఒక చిన్న భూభాగాన్ని త్రిశూలంతో ఎత్తి పెట్టాడు ఆ ఊరే 'తిరుచ్చుళి' (సంస్కృతంలో త్రిశూలపురం).



శివతనయుడైన కుమారస్వామి లోక సంరక్షణార్థమై తిరుచ్చుళిలో అలగమ్మ, సుందరమయ్యర్ పుణ్యదంపతుల గర్భంలో అవతరించాడు.

1879 డిశంబరు30న అలగమ్మ గర్భంనుంచి ఒక ధవళ తేజస్సు ఉదయించి ఒక బాలుని ఆకృతి ధరించింది. తల్లిదండ్రులు ఆ బాలునికి "వెంకట్రామన్" అని పేరు పెట్టారు. ఆ బాలుడే "భగవాన్ రమణ మహర్షి" అనే కళ్యాణనామంతో లోక పూజ్యులయ్యారు.

వెంకట్రామన్ బాల్యం సాధారణంగా గడిచింది. అతనికి చదువు కంటే ఆటపాటలపై అనురక్తి ఎక్కువగా ఉండేది. అయితే అతను ఏక సంథాగ్రాహి. వెంకట్రామన్‌కి పసితనం నుంచి 'అరుణాచలం' అంటే సాక్షాత్ భగవంతుడు అనే భావం కుదిరింది. మధురైలో విద్యాభ్యాసం చేశాడు. పెరియపురాణం, శివభక్త విజయం దివ్యావేశంతో పఠించాడు.

వెంకట్రామన్ ఒక బంధువుని ఇలా ప్రశ్నించాడు "తాతా! ఎక్కడనుండి వస్తున్నావు" అని "అరుణాచలం నుండి" అరుణాచలం నుండి రావడమేమిటి? అరుణాచలం అంటే భగవంతుడే కదా! భగవంతుడి నుండి రాక పోకలు సాధ్యమా" అని ఆలోచనలో పడ్డాడు. అరుణాచలం అంటే తిరువణ్ణామలైలో

వున్న కొండ తెలుసా? అన్నాడాయన.

అరుణాచలాన్ని భగవంతుడిగా భావిస్తున్న వెంకట్రామన్‌కి అరుణాచలం 'కొండ' అనగానే నమ్మలేకపోయాడు. తన అనుభవంలో అది అనుగ్రహరూప మైన పరమాత్మ అని తెలుసుకున్నాడు.

వెంకట్రామన్ 17 సంవత్సరాల ప్రాయంలో ఎట్టి జపాలు, సాధనలు, గురూపదేశం లేకుండా కొన్ని క్షణాలలో మోక్ష సామ్రాజ్యాన్ని పొందాడు. శ్రీరమణులు ఈ విషయం గురించి ఇలా చెప్పారు "నేను మధురైలో ఒంటరిగా మేడమీద గదిలో కూర్చున్నాను. మంచి ఆరోగ్యంగా ఉన్నాను. హఠాత్తుగా నన్ను మృత్యువు దుమికి కబళించి వేస్తోంది. నాకు ఎట్టి భయమూ కలుగలేదు. మృత్యువు అంటే ఏమిటి? చనిపోయేది ఎవరు? అనే ప్రశ్నలు వుదయించాయి."

"కొన్ని క్షణాలలో మృత్యువు శరీరాన్ని పూర్తిగా లోగొన్నది. రక్తప్రసరణ, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, ప్రాణ స్పందన పూర్తిగా నిలిచిపోయాయి. శరీరం శవమైంది. కాని ఆశ్చర్యం! "నేను నేను" అను స్ఫూర్తిని అనుభవిస్తూనే వున్నాను. చనిపోయిన శరీరాన్ని సాక్షిగా చూస్తున్నాను. అప్పుడు ఇలా తలచాను......"

"ఈ శరీరం శవమైంది. దానిని నలుగురు శ్మశానానికి తీసుకు వెళ్ళి బూడిద చేస్తారు. అంతటితో ఈ శరీర గతమైన కథ ముగుస్తుంది. చనిపోయేది శరీరం "నేను" కు మృత్యువు లేదు. "నేను" శరీరం కాదు అని అనుభవ పూర్వకంగా గ్రహించాను."హఠాత్తుగా చీకటి వెలుతురుగా మారినట్లు మర్త్యుడైన వెంకట్రామన్ మృత్యువుకు ఎదురొడ్డి మృత్యుంజయుడై అవతరించాడు. ఈ సంఘటన శ్రీ రమణుని అపూర్వత్వాన్ని, దైవత్వాన్ని తెలుపుతోంది.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## ఏప్రియల్ 18 నుండి 24 వరకు శ్రీ కాళీవనాశ్రమ
## పెదనింద్రకొలను శాఖ వారు నిర్వహించిన శ్రీరామనామసప్తాహ దృశ్యములు



శ్రీ మాతాజీ వారిచే సత్సంగం



శ్రీ మాతాజీ వారిచే సంకీర్తన



శ్రీ సద్గురు పాదపూజ

Regd. News Magazine Periodical
Posted on 5th and 6th of every month

RNI No. 37804/81
Postal Regd. No.: GTR/27/2021-2023

## ఏప్రియల్ 25 న శ్రీ పరబ్రహ్మ షణ్ముఖానందాశ్రమం, పాలకొల్లు లో నిర్వహించిన శ్రీ మాతాజీ జ్యోతిర్మయానందభారతీ వారి ప్రథమ ఆరాధన, విగ్రహ ప్రతిష్ఠ దృశ్యములు.





If undelivered please return to
**SAMARDHA SADGURU**
SRI KALI GARDENS
Ashramam-522 508, Guntur Dist., A.P.